# 17. దేవకన్య

జానకి మీద నాకు ప్రేమ కలిగేందుకు ఆమె అందం మాత్రమే కారణం కాదు. ఆమె నాకు మరదలు కావటం అంతకన్నా కాదు. కారణం మాత్రం ఆమె జానకి కావటమే! ఐతే నేను మాత్రం రాముణ్ణి కాదు సుమండీ!

మొదటినుంచీ జానకి నాతో ఎంతో చనువుగా ఉంటూండేది. అది ఆమె పసితనంవల్ల నన్నా కావొచ్చు, లేక అత్తవారింట్లో నేను స్వతంత్రం తీసుకోగల వ్యక్తి ఒక్క జానకే కావటంవల్ల నైనా కావొచ్చు. నా భార్యకన్న ముందుగా పరిచయమైన జానకి విషయంలో, ఒకసారి హఠాత్తుగా ఆమెను అనుభవించాలనే కోర్కె కలగటానికి, ఆమెతోడి ఒక్క పరిచయమే నన్నంతదూరం లాక్కు వెళ్ళి వుంటుందని కూడా నేను అనుకోను.

ఒకవేళ, మొట్టమొదటి నుంచీ జానకి అంటే నాకు చెడు అభిప్రాయం వున్నా, అది నేను తెలుసుకో గలిగినంత బలంగా మాత్రం లేదని నా నమ్మకం. పోతే నేను ఆమెపట్ల తీసుకున్న స్వాతంత్ర్యమే ఎక్కువైందని నేను నమ్మగలిగే కారణాలు ఎన్నో ఉన్నవి. ఆ కారణాల్ని మూడు, నాలుగేళ్ళ క్రితమైతే నేను నమ్మేవాణ్ణి కాదు కాని, ఇప్పుడు యీడొచ్చి, పెళ్లి కాకుండా కాలేజీ చదువులో వున్న పిల్ల – అన్నీ తెలిసిన పడుచు నుంచి నేను కనిపెట్ట గలిగిన యీ ప్రోత్సాహాన్ని, ఇంకో విధంగా అర్థం చేసుకునే అవకాశం లేకపోయింది. నాకన్న ముందుగానే ఆమె నన్ను కోరుతూన్నట్టు నేను అర్థం చేసుకోగానే – నా మానవ హృదయ దౌర్బల్యం తనను తాను బైటపెట్టుకో సాగింది.

పరిస్థితుల అనుకూలత కోసం వేచి కూర్చున్నాను. సెలవల్లో అక్కగారికి సహాయం కోసం జానకి నా ఇంటికి వచ్చింది. చిన్నతనం నుంచీ, ఒకే ఇంట్లో పెరిగినట్టయితే జానకి నా పట్ల ఎలా ప్రవర్తించి ఉండేదో– ఇప్పటి జానకి ప్రవర్తనకూడా అంతే స్నేహాన్ని చూపిస్తూ వుంది. ఆమె యీ సౌహార్ద్ర హృదయం నా గాలిమేడలకు పునాది వేసింది.

ఆమె ఏ క్షణాన మా ఇంట్లో కాలు పెట్టిందో, ఆ క్షణం నుంచే నా మనశ్శాంతికూడా మాయమైంది. ఒక గొప్ప సమస్య నాకు ఎదురైంది. నా కోర్కె సంఘ నియమాలనూ, నీతిచట్టాల్నీ తేలిగ్గా జయించ గలిగింది. ఇక జానకిని వశపరుచు కోకుండా నేను యీ జీవితాన్ని గడపలేనని మాత్రం తెలుసుకున్నాను.

కానీ సమయం! ప్రతి చిన్న కోర్కె తీరేందుకూ కావలసిన మొట్టమొదటి సామగ్రి! రోజులు గడుస్తూన్నవి. నేను తన పట్ల వున్న యీ దురభిప్రాయాన్ని ఏ క్షణాన్నయినా మరిచి పోతానేమో నన్నట్టు– జానకి తన ప్రతి కదలికలోనూ నన్ను ఆహ్వానిస్తున్నట్టు, నా పురుషత్వాన్ని ఛాలెంజ్ చేస్తూన్నట్టు, ప్రదర్శించే ఆమె పోకడమాత్రం నాకు రాత్తిళ్ళు నిద్రకూడా లేకుండా చేసింది!

తొందరపడితే ఆ సమయంలో ఏమన్నా అఘాయిత్యం జరుగుతుందేమోనన్న భయం, నాకు లేక పోలేదు. ఎంత ధైర్యమున్నా మొదటి కలయిక – మొదటి కలయికే! అందులోనూ ఒకటికి నాలుగు నియమాల్ని ఛేదించి తీర్చుకోవలసిన ఇలాటి కోర్కె ఇచ్చే పిరికితనం, నిజమైన సమయాన్ని కూడా 'కాని సమయం' అనే పొరపాటు వల్ల వొదులుకోవల్సిన పరిస్థితి కూడా సృష్టించ గలదు!

ఐదారు సందర్భాల్లో ఆమెను వొత్తి చూశాను. కాని నేను అనుకున్నంతగా ఆమె చలించక పోవటం నాకు అనుమానాన్ని కలిగించకపోలేదు. ఐతే ఆమె తనకోర్కెను మాటలు మినహాగా మిగతా అన్ని పనులలోనూ వెల్లడించ గల ఆడది! మాటల్లేవు కదా నని మాట్లాడకుండా ఊరుకోలేని మగవాణ్ణి నేను! ఆడ, మగ మధ్య యీ భేదం ఉండగా, ముందడుగు వేయవలసిన బాధ్యత నాకే ఉంది. ఐతే, నా చేష్టలకు తగినట్టుగా ఆమె లొంగిపోవటం కూడా ఎంతైనా అవసరం. కాని ఆమెకిది మొట్టమొదటి అనుభవమై ఉండొచ్చు. అందుకని ఆమె సిగ్గుపడుతూ, నసుగుతూ – నేను 'ఎక్స్‌పెక్ట్' చేసినంత త్వరగా కాకుండా, క్రమంగా లొంగుతుంది. నా ఆతృత వల్ల ఆమె ఇంకా నా దగ్గరికి రాలేదేనని నిరాశపడటం, నాలాటి బుద్ధిమంతుడి లక్షణం మాత్రం కాదు.

నేను స్వతంత్రించి ఏ చెయ్యో పట్టుకున్నప్పుడు, ఆమె నా కళ్ళల్లోకి సూటిగా చూసేది. ఆ చూపులో వేడి వుంది. నా మనస్సులో ఘనీభవించిన కోర్కెను ఆ వేడి కరిగించేది. చేతి పట్టుకూడా మెల్లిగా సడిలేది. ఆమె మౌనంగా వున్నా– ఆమె ఆజ్ఞను నేను అర్థం చేసుకుంటున్నాను. ఇలాటి ప్రవర్తనను నేను గమనించి నప్పుడు 'ఇదే

ఆడదాని గొప్పతనం' అని కూడా అనిపించింది. 'తనకు నిజంగా ఏది కావాలో, అది పొంద గలిగి నప్పుడు, ఆడది మగవాడంత పొంగదు' పొంగకుండా ఉండగలదు; అంతేకాదు – అది తనకసలు అక్కర్లేదనీ, ఎదుటి వ్యక్తికి కావాలి కనుక ఒక ఆబ్లిగేషన్‌గా తను వస్తున్నాననీ కూడా మగవాణ్ణి భ్రమింప జేయగలదు!

పై సిద్ధాంతం ప్రకారమే నేను నా ప్రయత్నాల్ని పొడిగించాను. క్రమంగా మోతాదు కూడా పెంచుతూండటం వల్ల – నేను ఎటువైపు ఆమెను తరిమేందుకు ప్రయత్నిస్తున్నానో స్పష్టంగా అర్థం చేయగలిగాను కూడాను. ఆమె సిగ్గుపడవలసిన స్త్రీ; అందులోనూ తన అక్కగారింట్లో – అక్కగారి కాపరానికి అడ్డు పడే ప్రయత్నం చేయటం. మొదటి అనుభవంలోనే ఇలాటి అనేక అడ్డంకులను తెంచుకోగల ధైర్యాన్ని ఆమె హృదయం ఆక్రమించాలి. వీటి కోసమే ఆమెకు మరికొంత కాలం కావలసి ఉంటుంది.

కాని కాలం చాలలేదని కూర్చుంటే అసలే లాభం లేదు. సమయం కోసం నేను కాచుకు కూర్చోవటం కన్న, ఆ సమయాన్ని సృష్టించుకోవటానికి ప్రయత్నించటం చాలా మంచిది. ఇలాటి పనులు చేయటంలో నా తెలివితేటలు మాత్రం వృథా కాలేదు.

రెండు మూడు సందర్భాలలో "బావా! ఏమిటిది? నీకేమన్నా మతి పోతోందా?" అనే మాటల్ని ఆమె నోటినుంచి వినవలసిన అవసరం కూడా యీ నిర్భాగ్యుడికి కలిగింది.

అంతతో ఊరుకున్నా పొయ్యేది. కాని ఇది మానవ హృదయం. శృంగభంగాన్ని భరించటం అందరికీ చేతనైంది కాదు. అందులోనూ నన్ను రెచ్చగొట్టింది జానకి! ఆమె చేతనే నిరాకరించ బడటంలో అర్థం లేదు. ఒకవేళ తన ప్రవర్తన నన్ను రెచ్చగొడుతోందనే సంగతి, ఆమెకు తెలియకుండానే ఇంతదూరం వొచ్చిందేమో? ఐతేమాత్రం– చూడకుండా తొక్కినా తాచుపాము ఊరుకోగలదా? నాకు హాని జరిగింది. అవతలి వ్యక్తి ఉద్దేశ్యంతో నాకు నిమిత్తం లేదు. ఎందుకు ఉండాలి?

కావాలని నన్ను రెచ్చగొట్టి, ఇప్పుడు భయపడో, సిగ్గుపడో, లేక మరి ఏ ఇతర కారణంవల్లనో, వెనక్కు జారుకోవటంవల్ల, నా బాధ ఆమెకెలా తెలుస్తుంది? లేక ఇది దొంగవేషమా? నేను తనను ప్రాధేయపడతాననో, లేక నా చేత ఇంకా బతిమాలించు కోవాలనో, నేనే తనకు దాసానుదాసుణ్ణయేదాకా లొంగకూడదనో, ఆమె యీ దొంగ వేషాన్ని, యీ ప్రణయకోపాన్ని ప్రదర్శిస్తున్నదేమో? ఇదే నిజమై ఉండాలి.

ఆమె నన్ను కోప్పడ్డా ఆమె ప్రవర్తన మళ్ళీ యధాప్రకారం గానే వుంది. నాలాటి విజ్ఞానవంతుడైన నాగరీకుడికి, ఒక్కమాటే చాలనుకుందా? ఇది అబద్ధం– నేను తనకు కావాలి. ఐతే ఆ కోర్కె నా ద్వారానే రావాలి. నేనే అన్నిరకాల స్వాతంత్ర్యాల్నీ తీసుకోవాలి. ఏ విధమైన నిందకూ తను గురి కాకూడదని జానకి ఆలోచించి వుంటుంది!

నేను ఎన్నిరకాల ప్రయోగాల్ని చేసి చూసినా, ఆమె మాత్రం మండి పడేది. క్రమంగా ఆమె తన పూర్వస్నేహాన్నీ, చనువునూ తగ్గించుకో సాగింది. చివరకు ఆమెకు ఏ కారణానో కాని, నామీద ఉద్దేశం లేదని నిశ్చయంగా తెలుసుకున్నాను.

వెర్రిమొర్రి వేషాలు వేయటం, ఆమెతోడి సరసాలూ మొదలైనవి కూడా, నేను తగ్గించుకోవాల్సి వొచ్చింది. ఐతే అనుకోని యీదెబ్బ నాకు చాలా బలంగా తగిలింది. ఆమె మీద నాకుండే మధురమైన తలపులన్నీ, విషమ మైనవి. ఆమెను సాధించలేని నా విజ్ఞానం మీద నాకే అసహ్యం కలిగింది. ఎలాగైనా ఆమెను అనుభవించి 'లొంగదీసుకోగలిగాను చూశావా!' అనేదాకా నాలోని మంట చల్లారేట్టు కనిపించలేదు. ఆమెను అనుభవించి ధన్యత పొందుదామనే ఊహకన్న, ఆమెతోడి కలయికలోని సౌఖ్యంకన్న, ఆమెతోడి కోర్కెను తీర్చుకోకుండా కూడా బతకగలననే ఆశకన్న - ఆమెను పట్టుదల కోసమైనా అనుభవించి, పొందే మనశ్శాంతి కోసం, నేను ప్రయత్నించాలని నిశ్చయించుకున్నాను.

ఈసారి చేసే ప్రయత్నాలు, ఆమెకు తెలియ కూడదు. ఎందుకంటే తనంతట తానుగా ఆమె లొంగే సమయాలన్నీ దాటిపోయినయ్. కనుక ఆమెకు తెలియకుండా ఆమెను మోసగించి అనుభవించాలి.

ఎన్నో క్రూరమైన ఆలోచనలు నా బుర్రలో మెరిసినవి. తేలిక మార్గం, నా మనసు తీరేదారిని అన్వేషించటంలో నా బుర్ర ఎంతో వేగంగా పనిచేసింది. చివరకా ఆలోచనకూడా ఒక నిశ్చయానికి వచ్చింది.

నేను ప్రాక్టీసు పెట్టబోతూన్న డాక్టర్‌ను. అనేక రకాల మందుల్నీ వాటి ప్రయోగాల్నీ క్షుణ్ణంగా తెలుసుకున్నాను. వాటివాటి ప్రయోజనాలు కూడా నాకు బాగా తెలుసు.

జానకిని, లొంగదీసుకునేందుకు క్లోరోఫారమ్ నాకు ఎంతైనా ఉపయోగ పడుతుంది. ఆమెను మోసగించి నాయీ అవమానాగ్నిని చల్లార్చుకో గలుగుతాను. ఇన్నేళ్ళుగా నేను కష్టపడి సంపాయించిన విజ్ఞానం నాకు యీ క్లిష్టపరిస్థితిలో అంతులేని మనశ్శాంతిని ఇస్తుంది. యీ నిరాకరణవల్ల ఆమె ఇప్పుడు నాకు దూరమైంది. దూరమైన వస్తువును అందుకోవాలి కనుక నేను నా గమన వేగాన్ని రెట్టించక తప్పలేదు.

## 2

గడియారం రెండు గంటలు కొట్టింది. మా ఇల్లు ఒక్కటే కాక ఊరు ఊరంతా మాటుమణిగి వుంది. కాబట్టి నన్నెవ్వరూ గమనించరు. అడ్డగించే అవకాశం అసలే లేదు. ఒకరికోసం నేను భయపడాల్సిన పనిలేదు. నిరాఘాటంగా నేను చేయదల్చుకున్న పనిని చేసెయ్యవొచ్చు-

జానకి కిందిగదిలో పడుకుంది. మెల్లిగా చప్పుడు చేయకుండా మేడమెట్లుదిగి ఒక్క క్షణం జానకి గది తలుపు దగ్గర చెవిపెట్టి- ఆమె సుఖనిద్రలో వుందనే ధైర్యం కలగగానే లోనికి ప్రవేశించాను. డిమ్ లైటు గదిలోని ప్రశాంతతను కాపాడుతూ వుంది. పెద్దలైటు వేద్దామా వొద్దా అని క్షణం ఆలోచించి, యీ ఉన్న కాంతిలోనే నా మోసాన్ని సాగిద్దామని నిశ్చయించుకున్నాను.

క్లోరోఫారమ్ ఆమె నాసికారంధ్రాల సమీపానికి పోనిచ్చాను. ఆమె ఆ గాలిని పీల్చింది. నాకు భయం వేసింది- ఎంత పెద్ద ఆపరేషన్ సమయానకూడా నేనిలా వొణికి పోలేదు. కాని నా భయాన్ని నిందించుకుంటూ వెంటనే నిలవతొక్కుకో గలిగాను.

క్లోరోఫారమ్ పీల్చగానే, ఒకటి రెండు అంగుళాల ఎత్తున ఆమె తల లేచింది. అస్వాభావికమైన యీవాసన ఆమెను మేల్కొల్పివుంటుంది. ఆమె అమితమైన 'సెన్సెటివ్ గరల్' కావటంవల్ల ఇది జరిగి వుంటుంది. ఆ క్షణకాలంలో నేనెవర్నో ఆమెకు తెలిసి ఉంటుంది. అందుకనే ఆమె ముఖంలో ఆశ్చర్యాన్ని నేను స్పష్టంగా చూడగలిగాను. ఇదీ ఒకందుకు మంచిదే! నేనామెను పరాభవించానన్న సంగతి ఆమెకు తెలియకపోతే ఏం లాభం? ఐతే ఇది క్లోరోఫారమ్ కనుక, ఆమె మెలకువను ఒకటి రెండు క్షణాలకన్న నిలపలేక పోయింది.

తగినంత క్లోరోఫారమ్ ఆమె చేత పీల్చబడ్డది. ఆమె గాలి పీల్చే తరహాలోని మార్పునుబట్టి, నేనిది గ్రహించాను. ఆమె నిద్ర అప్పుడే మెలుకూ రాదు-!

నా అంతరాత్మ విజయగర్వంతో హూంకరించింది. ఒక్కసారి ఆమె ముఖంలోకి చూశాను. నన్ను మోసగిద్దామనో, పరాభవిద్దామనో వేసిన ఆమె ఎత్తులకు ఇప్పుడేం చెపుతుంది?

ఇక క్షణాల్ని లెక్కించుకోవాల్సిన సమయం. ఎలాగో శాస్త్ర విజ్ఞానం, నా కీ సదవకాశాన్ని కల్పించింది. యీ కృత్రిమ కనికట్టు ఎక్కువ సేపు ఉండదాయె!

జానకి పక్కలో కూర్చొని, అందమైన ఆమెముఖాన్ని ముద్దు పెట్టుకోబోయాను. కాని ఆశ్చర్యం! నిద్రలోకూడా ఎంతో అందంగా కనిపించే ఆమె ముఖంలో స్త్రీత్వమే కనిపించటం లేదు. ఎంతో బలవంతమైన మృగరాజు మొట్టమొదట బోనులో పడ్డప్పుడు తన క్రౌర్యాన్ని చూపేరీతిగా ఆమె బుసలు కొడుతోంది. ఇది క్లోరోఫారమ్ పని అని నాకు తెలియక పోలేదు... కాని- ఆమెను ఎలా అనుభవించటం!

ఆమెలో చైతన్య మనేది లేదు. ఆమె శరీరంలో రక్తం పారుతూనే వుంది. శరీరం 98.4 డిగ్రీల ఉష్ణాన్ని కలిగేవుంది. కాని తగినంత (తగినం తేమిటి - అసలే లేదనవొచ్చు) రెస్పాన్స్ ఏదీ?

శవానికీ ఆమెకూ ఒక్క గాలి పీలవటంలోనూ, శరీరోష్ణంలోనూ తప్ప, మరేభేదమూ లేదు. ఏ కదలికాలేని యీ కట్టెను నేనేం చేసుకునేది? ఇదే నా భార్యఐతే,

నాలోని ప్రతికదలికకూ తగినట్టుగా ప్రవర్తించి ఉండేది. ఏ భోగందో ఐతే కనీసం కొంతవరకైనా నటించేది-! ఎందుకంటే ఆమె మనిషి కనుక! కాని ఇక్కడ, యీ జానకిలోని మానవత్వమంతట్నీ క్లోరోఫారం చంపి కూర్చుంది. ఆమె మానవత్వం పనిచేస్తున్నట్టయితే నన్నిలా పక్కలో కూర్చోనిచ్చేదా?

ఆ సన్నని వెలుగు గుడ్డివెన్నెలవలె వుంది. ఆ ప్రశాంత ప్రకృతి శ్మశానవాటికను జ్ఞాపకం తెస్తూవుంది. ఇంకాస్సేపటికి నాశనం చేయవలసిన శవంలాగు ఆమె ఆ పక్కమీద పడుకొనివుంది... యీ ప్రాణహీన శరీరాన్ని నేనెలా....?

నా పట్టుదలను నేనింకా మరిచిపోలేదు. ఏ విధంగా నైనా సరే, ఎంత ఇష్టం లేకపోయినా, జానకిని అనుభవించే తీరాలన్న నా నిశ్చయం, ఒకపక్క నాకు అలారం కొడుతూనే వుంది. కాని నా బుద్ధి, మనసు, ఆత్మ, ఇవన్నీ తిరగబడుతూనే ఉన్నవి. మనసు విరిగిపోయినట్టయింది. జానకికీ, జానకిలాటి రబ్బరు బొమ్మకూ, లేక జానకి శవానికీ భేదాన్ని మనసు చూడలేక పోతోంది. కనీసం శారీరకంగానైనా తగిన సహాయం వుంటుందేమోనని ప్రయత్నించాను. పుర్రెలో లేనిదే శరీరంలో ఏం మార్పు కలుగుతుంది? ఎంత ప్రయత్నించినా పురుషత్వం మేల్కొనకుండా వుంది. నేనుకూడా జానకి జాతికే చెందిపొయ్యానేమో ననిపించింది.

ఏ కాస్త వేడన్నా పుడుతుందేమోనని, అక్కడే కొయ్యబారి నిలబడి వున్నాను. నిమిషాలు నడుస్తూన్నవి. జానకిలో క్రమంగా చలనంకూడా ప్రారంభమైంది. ఒకటి రెండుసార్లు లేవాలని ప్రయత్నించి లేవలేక పడిపోయింది. ఇక అక్కడ నిలబడటం అంత శ్రేయస్కరం కాదని ఆ ఓటమితోనే తోక ముడిచాను.

మేడ మెట్లదగ్గరకు ఎలా వొచ్చానో తెలియదు. ఆ మెట్లు ఎక్కే ఓపిక లేక మొదటి మెట్టుమీదనే కూలబడ్డాను.

నేనెంత క్రూరుణ్ణి! ఏదైతే కృత్రిమంగా అనుభవించాలని ప్రయత్నించానో, ఏ విధంగానూ దాన్ని అనుభవించలేక పొయ్యాను. ఇకముందు అనుభవించగలనని కూడా అనుకోను. నేను కోరింది ఒక్క శారీరక సౌఖ్యమే- కాని అది అనుభవించ గలిగేటంత పశుత్వం నాలో లేదని నేను తెలుసుకోలేక పొయ్యాను.

ఇదీ ఒకందుకు మంచికే వొచ్చింది. ఇకముందు జానకిమీద నా కెలాటి దురూహ కలగదు. జానకిని అపార్థం చేసుకునే అవకాశం మరి వుండదు. యధాప్రకారంగా ఇద్దరమూ పవిత్ర స్నేహాన్ని మాత్రమే అర్థించ గలుగుతాం. నా హృదయంలోని యీ కల్మషం కడగబడ్డది కనుక, నాకిక బాధ పడాల్సిన పని లేదు. నా యీర్ష్య, నా పట్టుదల ఇంకో రూపంలో చల్లారినవి.

తెల్లవారింది. జానకి ముఖాన్ని చూడలేక పొయ్యాను. ఎంతో ప్రయత్నంమీద, ఆమెను చూసినప్పుడు ఆశ్చర్య పొయ్యాను. దీర్ఘకాల రోగి ముఖంవలె ఆమె ముఖం

కాంతివిహీనంగా ఉన్నది. ఆమె అందమంతా ఏమైందో, ఉత్సాహమూ, చలాకీతనమూ ఎటు వెళ్లాయో తెలీదు. కానీ నన్ను చూసి ఇంకా బుసలు కొడుతూనే వుంది.

ఏదో సాకుమీద పలకరించాను. ఆమె జవాబు చెప్పకుండా రుసరుస లాడుతూ తప్పుకు పోయింది. నేను ఎంత ప్రయత్నించినా ఆమె కోపం తగ్గలేదు. నేననుకుంటాను; ఆమెకు అంతా అర్థమై వుంటుందని.

"జానకి మధ్యాహ్నం బండికి వెళ్ళిపోతా నంటోంది. స్టేషన్ దాకా పంపిరండి" అంది మా ఆవిడ అదోలా.

నా గుండెల్లో రాయి బడ్డది. ఆమెకు తెలిసినందుక్కాడా నాకు బాధ లేదు. కాని నా కీర్తి మరెంత దూరం వెళ్తుందోనని భయపడ్డాను. తెలివిగల జానకిలాటి పిల్ల, ఇలాటి విషయాన్ని బైట పెట్టుకోవటం, నాకే కాకుండా తనకుకూడా ముప్పేనని గ్రహించుకో గలదని నాకు ధైర్యం వుంది. కానీ ఎటుపోయి ఎటొస్తుందో ఎవరూ చెప్పలేరు గదా?

మధ్యాహ్నం మరింత టైమ్ ఉండగానే, ఆమెను స్టేషన్‌కు జేర్చాను. ఎలాగైనా ఆమెతో ఏకాంతంగా సంభాషించి, బతిమాలి, భంగపడైనా ఆమె నోటిని కట్టెయ్యాలని నా ఏడుపు.

"జానకీ! పది నిమిషాలసేపు నీతో మాట్లాడాలి–" అన్నాను ప్రార్థనాపూర్వక స్వరంతో.

"రాత్రి మాట్లాడారుగా!" అంది జానకి భగ్గున మండిపడుతూ.

"రాత్రి ఏం జరిగిందో నీకు తెలియదు. కాని నువ్వను కున్నట్టుగా–"

"చాల్లెండి. డాక్టర్లయినందుకు–" అని విసిరి కొట్టింది.

"జానకీ! విను: నేనేమీ చెయ్య లేదు. నేను చేసింది తప్పేకాని, యీ ఒక్క తప్పుకూ క్షమించమని వేడుకుంటున్నాను. నీ కాళ్లు పట్టుకునేందుకైనా వెనుకాడను కాని, పదిమందీ తిరుగుతూన్న రైల్వే ప్లాట్‌ఫారం కనుక–"

"నయమే! మళ్ళీ కాళ్ల సంగతి వొచ్చిందీ?" అని ఆమె తన పాదాలను వెనక్కు లాక్కుంది; నేను కాళ్లవైపు జేరతానేమోననే అనుమానంతో కాబోలు.

"జానకీ విను. నీ కన్యాత్వం చెడ లేదు. నన్ను నమ్ము. ఈ ఒక్క తప్పుకూ..."

"చాల్లే ఊరుకోవయ్యా!"

ఇంత యీసడింపుగా మాట్లాడినా, నాకు కోపం రాలేదు; కాచుకోవాల్సింది నా బుర్ర కనుక. ఇదేకాక ఇంకా ఇలాటి మాటలు ఎన్నయినా భరించగలిగే మూడ్‌లోనే వున్నాను.

"జానకీ భగవంతుడి తోడు..."

ఆమె లేచి నిలబడ్డది. ఈ ప్లాట్‌ఫారం మీద నన్ను లాగి తన్ని ఒక చిన్న లెక్చర్ కూడా ఇస్తుందేమో నన్నంత ఉధృతంగా వుంది ఆమె ముఖకళ. ఆమెను ఇంకా బతిమాలటంవల్ల నేనే యీ పరిస్థితిని కావాలని తెచ్చుకున్న ట్టవుతుందేమో? ఏ విషయాన్నయితే ఆమె మింగి మరచిపొయ్యేందుకు ప్రయత్నించాలో, అదే విషయాన్ని నేను జ్ఞాపకం చేస్తూండటంవల్ల, ఆమె చల్లారేందుకు మారుగా - రాత్రి ఏం జరిగి వుంటుందని ఆమె నిశ్చయించుకుందో, అదే పని తిరిగి మళ్ళీ మళ్ళీ జరుగుతూన్న భావనకు గురికావటంవల్ల, ఆమె కోపం మిన్ను ముట్టుతుంది. అందుకని ఏమైనా కానీమని నేను ఊరుకున్నాను.

ఆమె రైలులో ఎక్కింది. రైలు సాగింది. కిటికీలోంచి విజయగర్వంతో ఆమె నవ్వింది- కనీసం నవ్వినట్టు నాకు కన్పించింది. నిజానికి నేను ఓడిపొయ్యాను. కాని నేను ఓడిపోయింది, జాగ్రదావస్థలో నున్న యీ జానకిచేత నైతే, ఇంత బాధ పడేవాణ్ణి కాదు. నిర్జీవమైన ఆమె శరీరం, వర్చస్సులేని ఆమె ముఖం, నన్ను ఓడించి వేసినవి. జానకిని చూసినప్పుడల్లా ఆనాటి రాత్రి శవాకారం నాకు కనిపిస్తుంది. ఆ భావన నా శరీరంలో ఒక చల్లని ప్రవాహాన్ని మూల మూలలా ప్రవహింప జేసి, నన్ను చంపుతూన్న ట్టనిపిస్తుంది. లేనిపోని యీ తద్దినాన్ని నా జీవితాంతం వరకూ మరిచి పోలేనేమో? నీడలా అది నన్ను వెంటాడక తప్పదేమో!

ఆరు సంవత్సరాలు గడిచినవి. జానకిని సూటిగా ముఖంలోకి చూసే ధైర్యం నా కెప్పుడూ కలగ లేదు. ఆమెకు ఇద్దరు పిల్లలు. ఆ పిల్లల దగ్గర కూడా నేను భీరువుగా తయారయ్యాను. జానకి అందాన్ని చూసి ఆనందించలేని యీ కృత్రిమపు గుడ్డితనం, నాకు సంక్రమించింది. నా శాస్త్ర విజ్ఞానమూ, మందులూ, మాకులూ, ఇవేమీ నా యీ గుడ్డితనాన్ని కుదర్చలేవు. జీవితమంతా భరించాకన్నా ఇది వొదులుతుందనే ధైర్యం నాకు లేదు.

నేను ఉండబట్టలేక, నలుగురైదుగురు ముఖ్య స్నేహితులకు నా యీ విషాధగాధను ఇంకోరి పేరుమీద చెప్పాను. వాళ్లెవరికీ అర్థమైందని నేను అనుకోను. "ఆ సమయంలో అనుభవించ లేని దద్దమ్మ..." అని ఏదో వాగేశారు- మానవత్వం అంటే తెలుసుకోలేని మానవులు!

కానీ జానకి ఎవరితోనూ చెప్పలేదు. చివరకు ఆమె పైకి చెప్పకపోయినా, మనసులోనే నన్ను క్షమించింది. అది నాకు మరింత బాధనే కలిగించింది. నేనా తప్పుకు శిక్షను అనుభవించినట్లయితే, నాకీ హృదయ భారం తగ్గేది. కాని ఇతరుల చేత క్షమించ బడటం మాత్రం నా మనశ్శాంతికి భంగకరమే! ఆమె ఎవరితో నన్నా చెప్పే వుంటే; ఆమె 'చెపుతుందేమో' నన్న భయం నాకు పూర్తిగా వొదిలి పొయ్యేది.

'నీ నేరాన్ని నేనే భరించాను. నీ రహస్యం నా ఒకతె దగ్గరే వుంది. జాగ్రత్త!' అని బెదిరించే ఆమె చూపుల తాకిడికి తట్టుకోలేకుండా ఉన్నాను.

జీవితంలో చాలాసార్లు ప్రయత్నించాను; నిజంగా ఆ రాత్రి ఏం జరిగిందో జానకికి అర్థమయేట్టు చెప్దామని. ఆమె ఒక్కతే అర్థం చేసుకోగలదని నా నమ్మకం. అందులోనూ, ఆమె ఏవిధమైన అపోహలో నన్నింత పెద్ద తప్పుకు గురి చేస్తోందో, దాన్ని నేను ఆమె కళ్ళలో చూడలేకుండా ఉన్నాను. కాని ఆమె నామాటను ఎక్కనివ్వదు. 'నాకు అంతా తెలుసు...' అని ఊరుకుంటుంది. ఆ రాత్రి ఆ గదిలో వున్నది - ఆమె, నేను, ఆ సర్వాంతర్యామీ మాత్రమే. నా మాటను ఆమె యీ జన్మలో నమ్మదు. ఆ సర్వాంతర్యామి యీ జన్మలో ఆమెకు కనిపించి నిజాన్ని చెప్తాడనే ఆశ నాకు లేదు!

ఆమె దేవకన్య, ఆమె దైవత్వాన్ని నేను ఏ విధంగానూ పాడు చెయ్యలేదు! పాడు చెయ్యలేక పొయ్యాను; పాడుచెయ్యను కూడాను. ఆమె 'దేవకన్య' అనే మాటను ఆ రాత్రే గ్రహించాను. పతివ్రతలు అధికంగా వున్న దేశంలో, పాతివ్రత్యం కాపాడబడే విధానంకూడా, నా నసాళానికి అంటింది. కాని యీ దేవకన్యకు మాత్రం 'దేవ రహస్యం' తెలియదు. ఒకవేళ తెలిసివుండికూడా, తెలియనట్టుగా నటిస్తూ వుందేమో ఆ సంగతి గూడా నాకు తెలియదు!

– *అక్టోబర్, 1948*